ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



రొట్టెల పండుగ నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : రొట్టె పండుగగా గుర్తింపు పొందిన నెల్లూరు బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగ ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన పండుగ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. జులై నెల 6వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న పండుగలో విధులను నిర్వహించాల్సిన సిబ్బంది జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. మంచినీటి సదుపాయం, మున్సిపల్ సిబ్బందికి భోజన వసతి, హై మాస్ట్ విద్యుత్ లైట్లు, తాత్కాలిక అంతర్గత దారుల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, బ్లీచింగ్, సున్నం, మొబైల్ టాయిలెట్లు, ఐయోమ టాయిలెట్లు తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు.ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఈ.ఈ శేషగిరిరావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, మలేరియా విభాగం అధికారి జీజియా బాయి ఉన్నారు.

నాడు ఎమర్జెన్సీ కన్నా.. మోడీ విధానాలే ప్రమాదం

రాజ్యాంగానికి తూట్లు.. - సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నాడు ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ కన్నా నేడు ప్రధాన మంత్రి మోడీ విధానాలే ప్రమాదంగా ఉన్నాయని, వాటిని తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. బుధవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో 50 సంవత్సరాల ఎమర్జెన్సీ తరువాత నాడు-నేడు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అధ్యక్షత వహించారు. సదస్సులో బాబూరావు మాట్లాడుతూ 1975లో ఇందిరా గాంధీ రాత్రికి రాత్రే ఎమర్జెన్సీ ప్రకటించి, లక్షలాది మంది కమ్యూనిస్టులు, ఇతర పార్టీ నాయకులను అరెస్ట్ చేసి, జైల్లో పెట్టారన్నారు. ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ నిర్బంధ ఆపరేషన్లతోపాటు, ఢిల్లీలో ప్రజల ఇళ్లను ధ్వంసం చేశారన్నారు. అప్పట్లో పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయన్నారు. జిల్లాలోనూ ఎమర్జెన్సీ సమయంలో సిపిఎం నాయకులతోపాటు, విద్యార్థి నాయకులు, పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. ఆరోజు ఇందిరా గాంధీ తమ రాజకీయ భవిష్యత్తు కోసం దేశంలో అశాంతి నెలకొల్పారన్నారు. ఆ నిరంకుశానికి 50 సంవత్సరాలు నిండాయని, ఇప్పుడు మోడీ ప్రభుత్వం అంతకన్నా దారుణమైన ఎమర్జెన్సీ అమలు చేస్తుందన్నారు. మతోన్మాదం పేరుతో దేశంలో అరాచకం సృష్టించిందన్నారు. నేడు నయా పాసిజంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మరింత సుదీర్ఘమైన విస్తృతమైన పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఆరోజు, ఈ రోజు నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. ఎమర్జెన్సీ ఇందిరా గాంధీ నిర్ణయంలో అందరినీ ఒకేలా చూసిందన్నారు. ఆరోజు ఇందిరా గాంధీకి మద్దతుగా నిలిచింది ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో దేశ ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంటే, కమ్యూనిస్టులు పోరాటం చేస్తుంటే బ్రిటిష్ వారికి లొంగిపోయి లేఖలు రాసి, వారికి అనుకూలంగా వ్యవహరించింది ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కూడా ఆర్‌ఎస్‌ఎస్ మోసపూరితంగా వ్యవహరించారన్నారు. బిజెపి నేత సుబ్రమణ్యం స్వామి రాసిన పుస్తకంలో ఉన్నాయని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ ఆర్‌ఎస్‌ఎస్ సమర్థించిందన్నారు. ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ హత్య దినోత్సవం కింద సభలు జరుపుతున్నారని, ఎమర్జెన్సీ రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత బిజెపికి, ఆర్‌ఎస్‌ఎస్‌కి లేదన్నారు. రాజ్యాంగాన్ని ఇందిరా గాంధీ ఉల్లంఘించారని, ఇప్పుడు బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ మూల స్తంభాలు నరకేస్తుందన్నారు. గతంలో ప్రజాస్వామ్యానికి జరిగిన హానిని గుర్తుచేసుకోవడం కాకుండా నేటి పరిస్థితులు అర్థం చేసుకోవాలన్నారు. బిజెపి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని, దీనిని రక్షించే ప్రచారం చేస్తున్నారని, దీనిని ఎదుర్కోవాలన్నారు. ఆరోజు, ఈరోజు పోరాడింది విద్యార్థులు, అభ్యుదయ వాదులు, సిపిఎం నాయకులకు చరిత్ర ఉందన్నారు. నేడు రాజ్యాంగానికి, ప్రజా స్వామ్యానికి జరుగుతున్న ప్రమాదాన్ని ప్రజలకు వివరించాలని, అందులో సిపిఎం నాయకులు, కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు లాయర్ బివి రమణారెడ్డి, పి.శ్రీరాములు, జనావెంకన్న, చంద్ర రాజగోపాల్‌తో పాటు తదితరులు ఎమర్జెన్సీ కాలంలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులు, ఆ నాటి పరిస్థితులను వివరించారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబురావు

బాలికను హింసించడం దుర్మార్గం..

గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి -నెల్లూరు : సెల్ ఫోన్ అపహరించిందనే అనుమానంతో అకారణంగా పదేళ్ల బాలికను వాతలు పెట్టి హింసించడం అమానవీయ సంఘటన అని, బాధిత బాలిక బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా తీసుకుంటుందని, ఆ చిన్నారికి అన్ని విధాల అండగా ఉంటామని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం ఉదయం అపోలో ఆసుపత్రిలోకలెక్టర్ ఆనంద్ తో కలిసి బాలికను మంత్రి సంధ్యారాణి పరామర్శించారు. బాలిక ఆరోగ్య స్థితిగతులను వైద్యులను అడిగి ఆమె తెలుసుకున్నారు. బాలిక త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని అపోలో వైద్యులకు సూచించారు. మంత్రి సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం కాశర్ల దిబ్బలో సెల్ ఫోను దొంగిలించిందని అనుమానంతో బాలికను పక్కింటి వారు వాతలు పెట్టి హింసించడం అత్యంత క్రూరమైన చర్య అన్నారు. ఈ ఘటన పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధను వ్యక్తం చేశారన్నారు. వారి ఆదేశాల మేరకు బాలికను పరామర్శించి ప్రభుత్వం తరపున రూ 50వేలు అందించామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు సూచనల మేరకు ఆ బాలికకు అవసరమయ్యే పూర్తి విద్యను ఉచితంగా ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. మంత్రి వెంట స్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్ తదితరులున్నారు.

మాట్లాడుతున్న మంత్రి సుధారాణి

ఆగస్టు 15 లోపు ఆధార్, రేషన్ కార్డులు

జిల్లాలో ఆధార్, రేషన్ కార్డులు లేని గిరిజనులకు వచ్చే ఆగస్టు 15 లోపు వాటిని అందిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సంధ్యారాణి గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

వైసిపి ఎన్నికల గుర్తు గొడ్డలి పెట్టుకోవాలి

సింగయ్యది జగన్ చేసిన హత్యే - ఎస్‌సి కమిషన్ జోక్యం చేసుకోవాలి- సోమిరెడ్డి

ప్రజా శక్తి-నెల్లూరు ప్రతినిధి

మజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఎన్నికల గుర్తును గొడ్డలిగా పెట్టుకోవాలని , రాష్ట్రంలో హింసను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారని సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల జగన్ వాహనం కింద పడి మృతి చెందిన సింగయ్యది హత్యగా చెప్పారు. ఇందుకు జగన్ బాధ్యత వహించాలని, జాతీయ ఎస్‌సి కమిషన్ జోక్యం చేసుకోవాలని కోరారు. మనిషి ప్రాణం పోతుందనే కనికరం కూడా లేకుండా సింగయ్య శరీరాన్ని లాగి పక్కన పడేశారన్నారు. జగన్ రెడ్డి కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇచ్చింది రెంటపాళ్లలో..అది కూడా 3 కార్లు,,వంద మందికి మాత్రమేనని, 9 గంటల సేపు 90 కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించి ముగ్గురు ప్రాణాలను బలితీసుకున్నారన్నారు. రెంటపాళ్లకు వెళ్లింది బెట్టింగ్ లో నిండామునిగిపోయి ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు అన్నారు. 2024 జూన్ 9న జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే ఆయన ప్రాణాలు తీసుకున్నారని గుర్తు చేశారు. దళితుల ప్రాణాలు బలితీసుకోవడం వైసీపీ నాయకులకు మొదటి నుంచి అలవాటే అని, గతంలో డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, ఉదయగిరి నారాయణ, దుగ్గిరాల కరుణాకర్..ఇప్పుడు సింగయ్యతో పాటు మరొకరు ఉన్నారన్నారు. జగన్ రెడ్డి భద్రత కోసం ఆ కార్యక్రమంలో ప్రభుత్వం 679 మంది పోలీసులను నియమించిందని, జెడ్ ప్లస్ కేటగిరి భద్రతలో ఉండే చంద్రబాబు నాయుడుపై పుంగనూరులో రాళ్లు వేయించారన్నారు. రాళ్లు వేయడమే గాక చంద్రబాబు నాయుడుతో పాటు వందల మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని, ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు జైళ్లకు పోవడం,,ఊళ్లు వదిలిపెట్టి పోవడం జరిగిందన్నారు. మద్యం స్కాములో జరిగిన అక్రమాల విలువ అధికారికంగా రూ.3200 కోట్లు అయితే..అనధికారిక విక్రయాలతో కలిపి స్కామ్ విలువ రూ.10 వేల కోట్లపైనే అన్నారు. తండ్రి సిఎంగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి రూ.43 వేల కోట్లు దోపిడీ చేసి 13 సిబిఐ కేసుల్లో ముద్దాయిగా ఉన్నారన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సోమిరెడ్డి

అపోలో ఆస్పత్రిలో

కేన్సర్ నివారణకు అత్యాధునిక వైద్య సేవలు

ప్రజాశక్తి -నెల్లూరు : నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని రకాల క్యాన్సర్ లకు అత్యాధునికమైన వైద్య సేవలు అందుబా టులో ఉన్నాయని హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. హాస్పిటల్ ఆంకాలజీ ఫిజీషియన్ డాక్టర్ హరిత, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.వి. ప్రసాద్, మానసిక వైద్యులు డాక్టర్ లక్ష్మీ రాజేష్, యూనిట్ హెడ్ బాలరాజుతో కలిసి డాక్టర్ శ్రీరామ్ సతీష్ మీడియాతో మాట్లాడారు. అపోలో సంస్థ దేశ వ్యాప్తంగా క్యాన్సర్ విన్ అనే కార్యక్రమాన్ని నిర్వహి స్తుందని చెప్పారు. క్యాన్సర్ విన్ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధి బారిన పడి అపోలో హాస్పిటల్ లో చికిత్స తీసుకుని, క్యాన్సర్ ను పూర్తిగా జయించి, నేడు ఆరోగ్యకరమైన జీవితం గడుపుతున్న వారి మనోగతాలను ప్రజలకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడినప్పుడు వారు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారు, అపోలో హాస్పిటల్స్ లో చికిత్స ఎలా అందించారు, క్యాన్సర్ ను పూర్తిగా జయించిన తర్వాత వారి యొక్క ఆరోగ్యకరమైన జీవన శైలి ఎలా ఉంది అనే వివరాలను స్వయంగా వారే వివరిస్తారని వెల్లడించారు. అనంతరం నెల్లూరు అపోలో హాస్పిటల్ లో చికిత్స తీసుకుని క్యాన్సర్ ను జయించిన వారు మాట్లాడారు. కేవలం అపోలో హాస్పిటల్ చికిత్స కారణంగానే తాము నేడు ఆరోగ్యకరమైన జీవితం గడుపుతున్నామని తెలిజేశారు.

మాట్లాడుతున్న అపోలో వైద్యులు

వైసిపి సమావేశానికి 'బుర్రా' హాజరు

ప్రజాశక్తి-కందుకూరు : వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన బుధవారం తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో జరిగిన రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనికి ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ హాజరయ్యారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని కొండి కందుకూరు, పలుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో ముందుగా రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకున్న రైతులకు రాయతీ జనుము విత్తనాలను పంపిణీ చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు నార్నె రోశయ్య, విద్యా సంస్థల అధినేత వున్న భాస్కర్, సర్పంచ్ శ్రీనివాసులు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు

గర్భిణులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : వరల్డ్ విజన్ ఇండియా కందుకూరు ఎడిపి ఆధ్వర్యంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎనిమియా, సివియర్ కాంప్లికేషన్స్‌తో బాధపడుతున్న గర్భిణి మహిళలు 30 మందికి ఫుడ్ బాస్కెట్ సరుకులు బుధవారం అందజేశారు. డిప్యూటీ డి ఎమ్ హెచ్ ఓ పద్మజ , మెడికల్ ఆఫీసర్స్ స్టెల్లా కారుణ్య ,బ్యూల గ్రేస్ , పి హెచ్ ఏన్ పద్మావతి పాల్గొనడం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డి ప్యూ టి డి ఎమ్ హెచ్ ఓ పద్మజ మాట్లాడారు. గర్భవతి మహిళలు గర్భం దాల్చిన నాటినుండి పోషక విలువలు గల సమతుల్యత వుండే ఆహారం తినడం ఆరోగ్యనికి మంచిదన్నారు. హాస్పిటల్ సిబ్బంది, వరల్డ్ విజన్ ప్రోగ్రాం ఆఫీసర్ కె యెషయా, వారి స్టాఫ్,ఆశా వర్కర్స్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలి : ఇంటూరి

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్

పారిశ్రామికాభివృద్ధికి రైతులు సహకరించాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు కలిశారు. మండలంలోని రావూరు గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్‌తో కలిసి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పారిశ్రామిక అభివద్ధి కోసం భూములు ఇచ్చే ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివద్ధి చెందిన తర్వాత స్థానిక యువతకు ఉద్యోగాలు వచ్చే విధంగా కషి చేస్తానని ఎమ్మెల్యే గారు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే పరిహారాన్ని పెంచి రైతులకు న్యాయం చేసిన సిఎం నారా చంద్రబాబు నాయుడు ముందుగా గ్రామ రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు.కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ భూములు ఇచ్చే రైతులందరూ న్యాయం చేస్తామన్నారు. సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ , తహశీల్దార్ విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించండి

ప్రజాశక్తి-కందుకూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంఎల్‌సి బీద రవిచంద్రను బుధవారం నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్ లో గల క్యాంపు కార్యాలయంలో కందుకూరు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్‌సిగా రెండో సారి ఎన్నికైన సందర్భంగా శాలువాతో సత్కరించి నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే శుభాకాంక్షలు తెలిపారు. మోషే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపునిచ్చే విధంగా పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. బీదను కలిసినవారిలో కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి కసుకుర్తి నవరత్నం , ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ , ఆలూరి ఆనంద్ , ఆలూరి అశోక్ కుమార్ ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్

విద్యుత్ స్తంభాలు బీటలు వారి అత్యంత ప్రమాదకరంగా మారాయని నగరంలోని 13వ డివిజన్ జనసేన ఇన్‌ఛార్జి పేనేటి శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. యలమవారిదిన్నె రాజీవ్ గాంధీ కాలనీలో నెలకొన్న తీవ్రమైన విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేవరకు జనసేన పార్టీ తరపున పోరాటం ఆగదన్నారు.

చిన్నారికి పరామర్శ

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్

అమానుష చర్యలకు గురై నెల్లూరు అపోలో హాస్పటల్లో చికిత్స పొందుతున్న చిన్నారిరిని జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పరామర్శించారు. .ఇలాంటి ఘటనలు జిల్లాలో జరగడం చాలా బాధాకరం అని అరుణమ్మ అన్నారు. బాదిత బాలికకు మెరుగైన వైద్యం అందిచాలని వైద్యులను కోరారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్

రోడ్డు ఆక్రమణలను తొలగిస్తామని నగర కమిషనర్ వై.ఓ నందన్ హెచ్చరించారు. 10వ డివిజన్ ఉస్మాన్ సాహెబ్ పేట, పరిసర ప్రాంతాలలో కమిషనర్ బుధవారం పర్యటించారు. మెట్లు, ర్యాంపులు తదితర శాశ్వత నిర్మాణాలను చేపట్టి కాలువల పూడిక తీత, సిల్ట్ ఎత్తివేత పనులకు ఆటంకం కలిగించవద్దని సూచించారు.అనంతరం సౌత్ రాజుపాలెం ప్రాంతంలో జరుగుతున్న స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు

రైతులకు సూచనలు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలంలోని చిమిడితిపాడు పరిధిలోని స్వర్ణజీపురం పాజర్ల గ్రామలలో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్యక్షత న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు, గ్రామ నాయకులు ఉన్నారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్

చిన్న చెరుకూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ప్రజా పరిషత్, ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రహరీ గోడ, ప్లాంట్ పనులని పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

ప్రజాశక్తి - సైదాపురం : ఊటుకూరు పంచాయతీలో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో సమస్యల సుడిగుండంలో ప్రజలు సతమతమవుతున్నారు. మురుగు కాలువల పరిస్థితి దయనీయంగా మారడంతో జనం దోమలతో వేగలేకపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు వచ్చిన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ని జనసేన సీనియర్ నాయకులు మరియు మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,జిల్లా కార్యాలయం ఇన్చార్జి జమీర్, పోలయ్య, జిల్లాసంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,రుషి యాదవ్ పాల్గొన్నారు.

తప్పటడుగులు వేసిన కూటమి ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన హామీలైన సూపర్ సిక్స్, 143 హామీలు నెరవేర్చకుండా ఏడాది ప్రభుత్వ పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని తొలి అడుగు పేరుతో సంబరాలు నిర్వహించుకోవడం తప్పని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు అన్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఇవేమీ పట్టించుకోకుండా సంబరాలు ఉత్సవాలు జరుపుకోవడం దారుణమన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వ పాలన 11 ఏళ్ళ,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా నాయకు లు మాట్లాడుతూ తమది డబల్ ఇంజన్,ట్రిబుల్ ఇంజన్ పాలనని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ రెండు ప్రభుత్వాల పాలన వల్ల ప్రజలపై ఆర్థిక భారాల మోపడం తప్ప పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు.కేబినెట్ సమావేశంలో అమరావతి రాజధాని నిర్మాణం కోసం మరో నలభై నాలుగు వేల ఎకరాల భూమిని సమీకరించాలని నిర్ణయం తీసుకోవడం అనాలోచితం అయిందన్నారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాస్తవానికి ఆ ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. 34 వేల ఎకరాలు రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం తీసుకొని 14 సంవత్సరాలు అయిందన్నారు. మూడు రాజధానిల పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టించిందన్నారు. కేంద్రంలో అధికారంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి నిధులు ఎంత మేరకు కేటాయించిందని ప్రశ్నించారు. లక్ష కోట్లు అవసరమైతే 15 కోట్లు విడుదల చేసి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. గతంలో రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పటివరకు అందజేయలేదన్నారు. ఉపాధి కోల్పోయిన వారికి పనులు చూపించ లేదని. నివాసముండేందుకు స్థలాలు కేటాయించ లేదన్నారు. ఉచిత విద్య వైద్యం సదుపాయాలు కల్పించలేదని, హామీలు అమలు చేయలేదని పేర్కొన్నారు. రైతుల నుంచి భూములు సేకరిస్తున్నది రాజధాని నిర్మాణం కోసమా లేక రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి అన్ని జిల్లాలు అన్ని ప్రాంతాలు వికేంద్రకరణ ద్వారా సమగ్ర అభివద్ధి జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజధాని అభివృద్ధి కోసం కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సేకరించాలని హితవుపలికారు. రాష్ట్రంలో ప్రభుత్వం నాయకులు మారిన విధానాలు మారలేదని కేంద్రం అడుగు జాడలలోని కూటమి ప్రభుత్వం పయనిస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎటువంటి పోరాటాలు ఉద్యమాలు నిర్వహించాలో ఆలోచన చేసి ప్రణాళికను రూపొందించుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ నివాస ప్రాంతాల కమిటీ కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

బలవంతంగా కార్ల స్టాండు తొలగింపు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఎదురుగా ఉన్న కార్ల స్టాండ్‌ను బుధవారం మున్సిపల్ అధికారులు బలవంతంగా తొలగించారు. 25 ఏళ్లుగా కార్ల స్టాండ్ బాలికల పాఠశాల ఎదురుగా నిర్వహిస్తున్నారు. సిఐటియు అనుబంధంగా ఉన్న కార్ల స్టాండ్ పాఠశాల విద్యార్థులకు ,.బాలికలకు ఎంతో రక్షణగా ఉంది. కార్ల యజమానులు, డ్రైవర్లు నిత్యం కార్ల స్టాండ్ కోసం ఏర్పాటుచేసిన రేకుల షెడ్డులో కూర్చోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఆ ప్రాంతంలో గడిచిన 25 ఏళ్లుగా జరగలేదు.ఓ వ్యక్తి పదేపదే ఇచ్చిన ఫిర్యాదులతో కార్ల స్టాండ్ ను తొలగించడానికి మున్సిపల్ అధికారులు గత కొద్దిరోజులుగా ప్రయత్నం చేస్తున్నారు. కార్ల స్టాండ్ నిర్వహణకు స్థలాన్ని కేటాయించమని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును ఇటీవల కమిటీ సభ్యులు కలిసి విన్నవించారు. స్థలం కేటాయించడానికి ప్రయత్నిస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో హఠాత్తుగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు బుధవారం కార్ల స్టాండ్ వద్దకు జెసిబి ,పోలీసుల తో రంగంలోకి దిగారు. కార్ల స్టాండ్ కోసం ఏర్పాటుచేసిన రేకుల పందిరి తొలగించడానికి ప్రయత్నించారు. కమిటీ సభ్యులు తోపాటు కారు డ్రైవర్లు, యజమానులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్యోగులకి కమిటీ సభ్యులతో పాటు కార్ల యజమానులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఇదే విషయాన్ని ఆ సమయంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బల్లలు తొలగించకుండా చూసేందుకు అధికారులతో మాట్లాడతానని చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు బల్లలు తొలగించకుండా పందిరి వరకు తీయడానికి అంగీకరించారు. దీంతో కార్ల స్టాండ్ కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా పందిరిని తొలగించారు.

స్టాండును తొలగిస్తున్న దృశ్యం

విద్యారంగంలో రామయ్య సేవలు చిరస్మరణీయం

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-కందుకూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విద్యారంగానికి కంచర్ల రామయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఎపి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు. ఇటీవల కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ అధినేత, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రిగారైన కంచర్ల రామయ్య మరణించారు. ఈ మేరకు బుధవారం నాడు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, అశోక్ రెడ్డి, పులివర్తి నాని,మురళిమోహన్,మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య ,తిరుపతి డిప్యూటీ మేయర్ మురళీకృష్ణ తదితరులు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ని పరామర్శించారు. కంచర్ల రామ య్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.కంచర్ల రామయ్య విద్యా రంగానికి అందించిన సేవలను నేతలు స్మరించుకున్నారు. ఎంఎల్‌సి శ్రీకాంత్ కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.



కంచర్ల రామయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రులు

నోటరీ స్టాంపులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కావలి

తక్షణమే కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నోటరీ స్టాంపులు ఏర్పాటు చేయాలని జిల్లా రిజిస్ట్రార్ ఎ.బాలాంజనేయులుకు కావలి న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. ప్రభ విద్యాసంస్థలో చదివే విద్యార్థులకు బయోడేటా అటెస్టేషన్ చేస్తున్నారు. అటువంటి సమయంలో అడ్రసు మార్పులుచేర్పులు, పేరుసవరణలు సమర్పించే సమయంలో నోటరీ ప్రమాణపత్రం చాలా అవసరమన్నారు. అలాగే జనన, మరణ సర్టిఫికెట్ పొందే సమయంలో ఈ నోటరీ ప్రమాణ పత్రం చాలా అవసరమన్నారు. దానికి నోటరీ స్టాంపులు చాలా అవసరమన్నారు. అలాగే ప్రజలకు, న్యాయ వాదులకు, న్యాయవాదుల గుమాస్తాలకు ఇక్కట్లు, రెండు, ఆయుధ, పదులు, ఇద్దరు పరిహారాలు స్టాంపులు అధిక సంఖ్యలో అందించాలని కోరారు. ముఖ్యంగా ఏదైన సమాచారం కోసం కాని, అఫిడవిట్లకు గాని కోర్టులందు బట్టలు లేదా ప్రాసెస్ ఫీజు కట్టాలంటే సరదు స్టాంపులు లభించక ఇబ్బంది పడుతున్నారు. కావున తక్షణమే జిల్లా కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నోటరీ స్టాంపులు ఎక్కువ మొత్తంలో అందించి కొరత తీర్చాలని, త్వరితగతిన కార్యాలయంలో నోటరీ స్టాంపులు అందించాలన్నారు. అలాగే కోర్టు ఫీ స్టాంపులు రిజిస్టర్ కార్యాలయంలో లభించక బ్యాంకు రుణాలు, ఇతర రుణాలు పొందేందుకు చిన్న చిన్న డాక్యుమెంట్లు తయారు చేయడంలో కోర్టు ఫీజు స్టాంపులు ముఖ్య అవసరం అని న్యాయవాదులు ఐ. సాయి ప్రసాద్, కె.చంద్రశేఖర్ రెడ్డి, న్యాయవాద గుమాస్తాలు కె.నాగరాజు, ఎం.శివకుమార్ రెడ్డి కావలికి వచ్చిన జిల్లా రిజిస్ట్రార్కు వినతి పత్రం అందజేశారు. దానికి త్వరలో పరిష్కారం చూస్తానని రిజిస్ట్రార్ తెలిపారు.

తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి-కావలి

ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైకుంఠపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ రామ్ సెంటర్ సహకారంతో పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు వ్యాక్సినేషన్, ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేఘనాథ్ చౌదరి మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు జరగకుండా, పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని, రక్తహీనత లేకుండా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలన్నారు. తదుపరి డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో ఐరన్, పోలిక్, కాల్షియం సిరప్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ కూనం శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, పి.హెచ్.సి కమ్యూనిటీ ఆర్గనైజర్లు చన్న కేశవులు, సునీత, ఎ.ఎన్.ఎం. రత్నకుమారి, ఆశా కార్యకర్త మోహన్, అంగన్వాడీ టీచర్ శారద, గర్భిణులు, బాలింతలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వడ్డిపాలెంలో పూర్వ సత్యానంద జ్ఞాపకార్థం వారి శిష్య బృందంతో బీరువా, నోటు పుస్తకాలు, ఆట వస్తువులు, కుర్చీలు ప్లేట్లు, గ్లాసులు, వాటర్ క్యాన్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొనర్ల శ్యాం ప్రసాద్, పద్మావతి దంపతులు వారి శిష్య బృందం పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ బి.గోవిందయ్య, మున్సిపల్ హై స్కూల్ 8వ వార్డు ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి, వడ్డిపాలెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.మహేష్, ఉపాధ్యాయులు జి.రవి, కె.ప్రసన్న, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలని వినతి

ప్రజాశక్తి-ఉలవపాడు

మండలంలోని కరేడు రెవెన్యూ పరిధిలో భూసేకరణను ఆపాలని కోరుతూ కరేడు గ్రామ రైతులు బుధవారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజకు వినతి పత్రం అందజేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. కరేడు గ్రామ రైతులు తమ సమస్యలను తెలిపారు.

నేటి నుంచి వృద్ధులకు రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో 2440 మంది వృద్ధులకు నేటి నుంచి రేషన్ పంపిణీ ఇంటి దగ్గరే ఇవ్వడం జరుగుతుందని తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని అంబేద్కర్ స్వామి వీధిలో ఉన్న చౌక డిపోను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుండి 30 వరకు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు రేషన్ పంపిణీ సకాలంలో పూర్తిచేసేలా సంబంధిత డీలర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి ఉన్నారు.

అంగన్వాడీ భవనాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కోవూరు

గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి భేటీ అయ్యారు. నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్లోని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నివాసానికి విచ్చేసిన మంత్రి సంధ్యారాణి అల్పాహార విందు స్వీకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గిరిజనులు, అంగన్వాడీలకు సంబంధించిన పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దువ్వూరు కల్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగుల పాలిట వరం జి.ఒ.నెంబర్-4

ప్రజాశక్తి-విడవలూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథంతో తీసుకున్న నిర్ణయం వికలాంగుల పట్ల వరమైందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వికలాంగులకు సంబంధించిన పారా స్పోర్ట్ చైతన్య యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. విద్యార్హతలను బట్టి ఎలాంటి పోటీ పరీక్షల్లోనైనా వికలాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు కల్పిస్తూ జి.ఒ.నెంబర్-4 విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

అంకమ్మ తల్లి 14వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విడవలూరు

విడవలూరు గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ అంకమ్మ తల్లి 14వ ప్రతిష్ట వార్షికోత్సవము ఆషాఢం 26 తేదీ గురువారం ఉదయం 7 గంటల నుండి అమ్మవారికి పంచామృత అభిషేకాలు హోమాలు కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు రవి తెలిపారు. అమ్మవారికి విశేషాలంకార అలంకరణ మరియు ప్రత్యేకమైన పూలతో అలంకరించి అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కోవూరు

జనశతాబ్ది రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని పడుగుపాడు గ్రామ పరిధిలోని రైల్వే గేటు వద్ద బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. కోవూరుకు చెందిన హుస్సేన్ కాలేజీ ప్రమాదవశాత్తు రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. మృతుడు కోవూరు బజార్ సెంటర్ పీటర్స్ కెనాల్ వద్ద ఉన్న మటన్ షాపుల పక్కన ప్లాస్టిక్ మందాలు అల్లే వ్యక్తిగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్పుపై కావలిలో శిక్షణ

ప్రజాశక్తి బిట్రగుంట

బోగోలు మండలంలోని మహిళా సర్పంచులకు స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారత గ్రామీణాభివృద్ధి దిశగా మార్పుపై శిక్షణ కార్యక్రమాన్ని కావలిలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం బుధవారం ప్రకటనలో తెలిపారు. గురు, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మహిళా సర్పంచులు అందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

'సోమిరెడ్డి' హామీలు నెరవేర్చాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ముత్తుకూరు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు

అధికారంలోకి రాక ముందు ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనేక హామీలు గుప్పించారని, వాటిలో ఒక్కటీ నెరవేర్చలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు అన్నారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ ముత్తుకూరు మండలం, కృష్ణపట్నం పోర్ట్ లోకంటైనర్ టెర్మినల్‌పై గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే వెంటనే కంటైనర్ టెర్మినల్‌ను కొనసాగిస్తామని ఎన్నికల సందర్భంగా మండల ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. వారు ఇప్పుడు అధికారంలో ఉన్నారు కాబట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కంటైనర్ టెర్మినల్‌ను కొనసాగించాలని కోరారు. నేలటూరు గ్రామాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలిస్తామని ఆనాడు హామీ ఇచ్చారన్నారు. ఆ గ్రామాన్ని కూడా వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. ఏపీ జెన్కో యాష్ పాండ్‌ను ఆనుకుని ఉన్న దేవర దిబ్బ గిరిజన కాలనీ నీ తరలిస్తామని కూటమి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రకటన చేసి ఉన్నారన్నారు. వారికి న్యాయం చేయాలని తెలిపారు. గతంలో యాష్ పాండ్ కట్ట తెగే నష్టపోయిన రైతులందరూకు నష్ట పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ రైతులందరికీ కూడా పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య మాట్లాడుతూ ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరు మండలంలో మత్స్యకారేతర ప్యాకేజీనీ తాము అధికారం లోకి వస్తే వెంటనే మండలంలోని ప్రజలందరికీ ప్యాకేజీ పంపిణీ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుందన్నారు. నేటికి కూడా మత్స్యకారేతర ప్యాకేజీ బ్యాలెన్స్ పంపిణీకి నోచుకోలేదన్నారు.గతంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం మత్స్య కారేతర ప్యాకేజీ బ్యాలెన్స్ వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ప్యాకేజీ పంపిణీ చేయనీ పక్షంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఈ మండలంలోని ప్రజలను సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నక్క రాధయ్య, పట్టపు జయరామయ్య, షేక్ మస్తాన్‌సా, దుంపల ఏడుకొండలు, బ్రహ్మ దేవి మోహన్ రావు, నక్క శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న 'బిజెపి'

ప్రజాశక్తి-బిట్రగుంట

మాట్లాడుతున్న తాళ్లూరు మాల్యాద్రి

ప్రజా హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని సిపిఎం సీనియర్ నాయకులు మాల్యాద్రి పేర్కొన్నారు. బోగోలు నాయకులు మండల సిపిఎం, కార్యాలయం లో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ 1975 ఇందిరా గాంధీ కాంగ్రెస్ పార్టీ అత్యవసర పరిస్థితిని దేశవ్యాప్తంగా ప్రకటించిందని, పర్యా సమానంగా అనేక ప్రజాస్వామ్యంగా హక్కులు హరించే వేయబడ్డాయని, చాలా మంది జర్నలిస్టులను, ప్రతిపక్ష నాయకులను, వామపక్ష నాయకులను కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వాదులను జైలులో సుమారు లక్ష మందికి పైగా పెట్టారని తెలిపారు. ఆ క్రమంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సిపిఎం వామపక్షాలు పెద్ద ఎత్తున పోరాడాయని, ఆ పోరాట ఫలితమే 1977లో జరిగిన ఎన్నికలలో ఇందిరా గాంధీ కాంగ్రెస్ చిత్తుచిత్తుగా ఓడిపోయిందని, ఇప్పుడు కూడా ప్రజాస్వామిక హక్కులను బిజెపి ప్రభుత్వంలో నరేంద్ర మోడీ హరించి వేస్తున్నారని తెలిపారు. చాలామంది భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని జైల్లో పెట్టినారని, ఉదాహరణకు ప్రొఫెసర్ సాయిబాబా, స్టెల్ స్వామి, ప్రవీణ్ ప్రొకాయిస్త లాంటి వాళ్లను జైల్లో పెట్టడం వారి మరణాలకు కారణం అవుతూ ఈరోజు బిజెపి అటువంటిత ఎమర్జెన్సీ దేశంలో అమలు జరిపి అత్త ఫాసిస్ట్ విధానాలను అమలు జరుగుతుందని తెలిపారు. మనం రోజు అప్పటి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఎట్లా పోరాడేమో ఇప్పుడు కూడా ఈ అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం పిలుపునిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను కార్మిక హక్కులను సంక్షేమ కార్యక్రమాలను పోరాటాలు చేసి పునర్ధించుకోవాలని దేశవ్యాప్తంగా సిపిఎం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్ల నరహరి, సిపిఎం సీనియర్ నాయకులు ఉప్పల యానాదయ్య, కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-మర్రిపాడు

మర్రిపాడు మండలం నుండి నందవరం ఆదర్శ పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు, కదిరినాయుడు పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఇఒలు జ్యోతి, ధనలక్ష్మి తెలియజేశారు. పదవ తరగతి ఫలితాలలో మండలంలో మొదటి ఐదు స్థానాలు సాధించిన నందవరం ఆదర్శ పాఠశాలకు చెందిన మహిత నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు, లహరి, రమ్య, వెంకటమనోహర్, యశ్వంత్ ఇడుపులపాయ క్యాంపస్ కు, కదిరినాయడు పల్లి ఉన్నత పాఠశాల చెందిన శృతి ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యారు. నందవరం మోడల్ స్కూల్ చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. కదిరినాయుడు పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపికవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకారాలు అందిస్తున్న ప్రవాస భారతీయులు ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కేశవరెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఎపి మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-దుత్తలూరు

దుత్తలూరు మండలంలోని ఎపి మోడల్ స్కూల్ నుండి నలుగురు విద్యార్థులు తమ ప్రతిభతో మరోసారి జిల్లాకే గర్వకారణంగా నిలిచారు. 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించి ఇటీవల వెలువడిన ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాల్లో మోడల్ స్కూల్ కి చెందిన నలుగురు విద్యార్థులు విశేషంగా రాణించి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. నిమ్మకాయల తనుశ్రీ (ఒంగోలు) షేక్ కాసింబి (శ్రీకాకుళం) సిహెచ్ సాత్విక (ఆర్కే వ్యాలి) ఏ.కీర్తన (ఆర్కే వ్యాలి)సీట్లు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జే.సైమన్ రావు మాట్లాడుతూ గతకొన్ని సంవత్సరాలుగా మా స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధిస్తూ వస్తున్నారు.అందులో భాగంగానే ఈ ఏడాది కూడా మా టీచర్ల శ్రమ, పిల్లల పట్టుదల ఫలితంగా ట్రిపుల్ ఐటీల్లో సీట్లు వచ్చాయి. ఇది మా స్కూల్ శిక్షణా ప్రమాణాలకు నిదర్శనం" అని ఆయన తెలిపారు. విద్యార్థుల ఈ విజయాన్ని మండల విద్యాధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందించారు. విద్యార్థులకు పాఠశాల తరపున మెరిట్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా మిగిలిన విద్యార్థులు కూడా ఉత్తమ లక్ష్యాల సాధనకు ప్రేరణ పొందాలని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు మహిళా సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు డివిజన్‌లోని అన్ని మండలాలకు సంబంధించిన మహిళా సర్పంచులకు గురువారం నుంచి స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత గ్రామీణాభివృద్ధి దిశగా మార్పుపై శిక్షణ కార్యక్రమం ఉంటుందిన ఎంపిడిఒ పి.రఫీ ఖాన్ తెలిపారు. ఈ శిక్షణ 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు.

మంత్రులను కలిసిన ఎంఎల్ఎ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

మంత్రి నిమ్మలను సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణలను కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి విజయవాడ లోని వారి కార్యాలయాల్లో బుధవారం కలిశారు. కావలి పట్టణ నడిబొడ్డున మాగుంట పార్వతమ్మ ట్రంక్ రోడ్డుపై ఏర్పాటు చేసిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాపుజాతి ఆణిముత్యం వంగవీటి మోహన రంగా కాంశ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జులై 2వ తేదీన జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి, కావలి కాపు నేతలు, రంగా అభిమానులు మంత్రులను ఆహ్వానించారు. తప్పక విచ్చేస్తానని మంత్రులు ఎంఎల్ఎకు హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రులతో చర్చించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, దేవరకొండ శ్రీను, ఆళ్ల శ్రీను, ఇస్కా విక్రం రెడ్డి, జనసేన నాయకుడు సిద్ధు, కాపు నేతలు పసుపులేటి బాబురావు, రంగా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

వెలుపాడు భూములు పరిశీలన

ప్రజాశక్తి-దగదర్తి

మండల పరిధిలోని వెలుపాడులో భూ పంపిణీకి సిద్ధంగా ఉన్న భూములను తహశీల్దార్ పి,కృష్ణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సర్వే నెంబరు 124, 341లో సుమారు 250 ఎకరాలు భూ పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు అనంతరం పమిడి రవికుమార్ చౌదరి మాట్లాడుతూ గత 30 సంవత్సరాల కిందట వెలుపాడు గ్రామస్తులకు పట్టాలు ఇచ్చే గానీ ఇంతవరకు భూమి చూపించలేదని తెలిపారు. ఈ విషయాన్ని కావలి నియోజకవర్గం శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే భూమి మొత్తాన్ని సర్వే చేసి అర్హులైన పేదవారికి భూ పంపిణీ చేయమని ఆదేశాలు జారీ చేయడంతో సర్వేనెంబర్ 124, 341లో ఎంత భూమి ఉందని తేల్చమని తహశీల్దార్‌కు చెప్పడంతో వెంటనే గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులతో గ్రామసభ ఏర్పాటు చేసి వారి దగ్గర ఎటువంటి ఆధారాలు ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. ఆ భూమిని సర్వే చేయించగా సుమారు 250 ఎకరాలు తేలిందని వారు తెలిపారు. భూ పట్టా తీసుకున్న ప్రతి పేదవాడికి న్యాయం చేస్తామని వారు తెలిపారు. భూ పంపిణీ కావలి నియోజకవర్గం శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి చేతుల మీదుగా జూలై 5వ తేదీ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు చల్లా శ్రీహరి, దాసరి శ్రీనివాసులు, విఆర్ఒ గౌతం, విఆర్ఎ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అంతర్జాతీయ మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, మస్తాన్‌బీలు డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పేడూరు గ్రామంలో మహిళా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శివకుమారి, మస్తాన్‌బీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందన్నారు. దాంతో కుటుంబాల్లో మద్యం కలహాలు సృష్టిస్తూ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీకి ఎక్కువ మంది మహిళలకి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘం కార్యదర్శి కంది పాటి రమణమ్మ, ప్రభావతమ్మ, అజ్మా, కామేశ్వరమ్మ, సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, మారుబోయిన రాజా, మోచర్ల రాధయ్య, వెంకటసుబ్బయ్య, చిన్నబ్బాయ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో పిఆర్ ప్రాజెక్ట్ వర్క్ ఎఇ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మల్లికార్జున రావు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అనుమసముద్రం గ్రామపంచాయతీ రోడ్ల దగ్గర తీసుకెళ్లి, రోడ్లను డిజిటలైజేషన్ చేయడానికి రూపొందించిన యాప్‌లో ఏ విధంగా ఫీల్డ్ లెవెల్‌లో ఎలా అప్లోడ్ చేయాలో డెమో క్లాసు ఇచ్చారు. కార్యక్రమంలో మండల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి పరామర్శ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలం లోని కుడితిపాలెం గ్రామానికి చెందిన చిన్నారి చెంచమ్మను టిడిపి యువ నాయకులు దొడ్ల మల్లికార్జున్ పరామర్శించారు. బుధవారం వైద్యశాలలో చికిత్స పొందుతున్న చెంచమ్మను స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు భరోసాని కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా టిడిపి అండగా ఉంటుందని ముఖ్యంగా స్థానిక ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని చిన్నారి బాగోగులు చూస్తుందన్నారు. చిన్నారి కోలుకున్న వెంటనే విపిఆర్ ట్రస్ట్ ద్వారా విద్యను అందించేందుకు చిన్నారి బాగోగులు చూసేందుకు ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి చేయూతనందించడం సంతోషకరమన్నారు. ఈ మేరకు ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పిఇటి ఉస్మాన్‌అలీ మృతికి సంతాపం

ప్రజాశక్తి-ఉదయగిరి



స్థానిక ఎ.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసి వేలాదిమంది విద్యార్థుల మన్ననలు పొంది, ఎంతో మంది జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులను అందించిన ఎమ్‌డి ఉస్మాన్ అలీ (84) బుధవారం స్థానిక స్వగృహంలో మృతి చెందడంపై పలువురు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విధి నిర్వహణలో విధులు నిర్వహించిన అనేక ప్రాంతాల నుండి శిష్యులు మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం రిటైర్డు ఉద్యోగుల ఉపాధ్యాయుల సంఘం ఉదయగిరి తాలుకా అధ్యక్ష కార్యదర్శులు ఖాదర్ బాషా, అబ్దుల్ రషీద్, ఎపి ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా మండల నాయకులు ఎమ్.డి. ఖాజా, షబ్బీర్, ఉదయగిరి ఖాదరీయ ఆస్తానా అధ్యక్షుడు అహమద్ బాషా ఖాలిది, ఉదయగిరి అభివృద్ధి ఫోరం అధ్యక్షుడు వి.రామ చంద్రమూర్తి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ పి.ప్రసన్న కుమారి మేడం అధ్యక్షతన ఎపిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు, సీనియర్ మేట్లకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు కూలీలను 3500 తగ్గకుండా కూలీల సంఖ్యను పెంచాలని తెలియజేశారు. ఎపిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని రైతులు నిమ్మ మామిడి బత్తాయి జామ మొక్కలను పొందుటకు వన్ బి, చిన్న సన్న కారు రైతు సర్టిఫికేట్, జాబ్ కార్డు తీసుకొని ఎన్ఆర్ఇజిఎస్ ఆఫీసులో ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మెట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నట్టల నివారణ'

ప్రజాశక్తి-ఉదయగిరి

26వ తేదీ నుండి జూలై 7వ తేదీ వరకు జరగనున్న నట్టల నివారణ డీవార్మింగ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కావలి వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.మల్లారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలోని బిట్ -1 రైతు భరోసా కేంద్రంలో వెటర్నరీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ శశిధర్ వైద్యులు వినయ్ కుమార్, రాఘవేంద్ర శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ 'తల్లికి వందనం'

ప్రజాశక్తి - ఉదయగిరి

అర్హులైన ప్రతిఒక్కరికీ బుధవారం సాయంత్రం లోగా స్కూళ్లలో నమోదైన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం వర్తిస్తుందని ఎంఇఒ-2 శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1వ తరగతిలో చేరిన నూతన విద్యార్థులకు యు డైస్‌లో ఆన్‌లైన్‌కు బుధవారంతో చివరి అవకాశం కల్పిస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. మొదటి విడతలు అభ్యంతరాలతో రానివారు సచివాలయంలో గ్రీవెన్స్‌లో అభ్యంతరాలను నమోదు చేసుకున్నందరికీ ఐదో తేదీ ప్రభుత్వం అందజేసే తల్లికి వందనం అందుతుందన్నారు.

రేషన్ డీలర్లతో సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కె.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రేషన్ షాప్ డీలర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తహశీల్దారు మాట్లాడుతూ రేషన్ షాప్ డీలర్లు అంకితభావంతో పనిచేయాలని, ఆంటీ అవకతవకలకు పాల్పడకుండా నిర్దేశించిన కాలమాన పట్టిక ప్రకారం రేషన్ షాపును తీసి ఉంచాలని, వికలాంగులకు, వయోవృద్ధులకు బయోమెట్రిక్ తీసుకొని రేషన్ సరుకులను విధిగా వారి ఇంటికి వద్దకు చేర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి. వెంకటేశ్వర్లు, ఆర్.ఐ. మస్తాన్ వలీ, సి.ఎస్.డి.టి. అజీవుల్లా ఖాన్, విఆర్ఒలు, డీలర్లు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో బుధవారం ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం వాసిలి, వీరారెడ్డిపల్లి, బట్టేపాడు, అప్పారావుపాలెం, మురగళ్ళ, కరటంపాడు, ఆత్మకూరు పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు ఎపిటిఎఫ్ సేవలకు మెచ్చి ఎక్కువమంది సభ్యత్వం స్వీకరించారని తెలిపారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ బాధ్యులు, ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్ రామ సుబ్బారెడ్డి, సిహెచ్ మల్లికార్జున్ రెడ్డి, వెంగయ్య, సురేష్, శివకుమార్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎస్‌డి సాజిద్, దయాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

బాల కార్మికులకు విముక్తి

ప్రజాశక్తి-కావలి

చైల్డ్ లేబర్ కాల్ సెంటర్‌కు వచ్చిన కంప్లయింట్ ఆధారంగా, కావలి ఆర్.డి.ఒ. ఎం.సన్నీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాకినాడ, రావులపాలెంలో పని చేస్తున్న చైల్డ్ లేబర్స్‌ను విడిపించి, స్వగ్రామం అయినా దగదర్తికి పంపారు. కార్యక్రమంలో సమతా, ఐ.సి.డి.ఎస్. పి.ఒ. సమతా పాల్గొన్నారు. కాగా పిల్లల వివరాలు చేవూరి యస్వంత్, తండ్రి దుర్గా ప్రసాద్ (10), చేవూరి వర్షిణి, తండ్రి దుర్గా ప్రసాద్ (12) వారి తల్లిదండ్రుల వద్దకు సురక్షితంగా చేరుకున్నారు.

ఎఎస్‌పేట దర్గాలో సందర్శన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ వెలసియున్న దర్గాను హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల హౌసింగ్ ఎఇ వివేక్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రభాకర్, జిల్లా హౌసింగ్ ఆఫీస్ సిబ్బంది దర్శించుకున్న వారిలో ఉన్నారు.

లేఅవుట్‌లో పరిశీలన

ప్రజాశక్తి-సంగం

సంగం చెక్‌పోస్ట్ సెంటర్ సమీపంలో ఉన్న హౌసింగ్ లే అవుట్‌ను హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఏఈ గౌస్ మొహిద్దీన్‌తో చర్చించారు. ఇళ్ళ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద ఉన్న లక్షా నాలుగు వేల ఇళ్లలో 30 వేల ఇళ్లు పూర్తవగా.. 22 వేల ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదని మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలియజేశారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నందున లబ్ధిదారులు ముందుకు వచ్చి తమ ఇళ్ళను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, కమ్మి, అదనపు ఆర్థిక సహాయం అన్ని ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్ళను పూర్తి చేసుకోవాలని సూచించారు.

పాలిటెక్నిక్ విద్యార్థికి రాష్ట్రస్థాయి ర్యాంక్

ప్రజాశక్తి-కావలి

కావలి గవర్నమెంట్ పాలిటెక్నిక్, (రుద్రకోట)లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి సి హెచ్. సందీప్ ఏప్రిల్ 2025లో నిర్వహించిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 988/1000 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించాడు.విద్యలో నిబద్ధత, నైపుణ్యం, శ్రమతో ఉన్న సందీప్ గారి ఈ ఘనత గర్వకార ణంగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీలకుమార్ ప్రియ, విద్యార్థి తల్లిదండ్రులను, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ శాఖ అధ్యాపకుల బందాన్ని సందీప్‌ని హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సానుకూల విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

పేద పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ నివాసులు ప్రస్తుతం నెల్లూరులో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు శ్రీనివాసులు - నీరజ దంపతుల మనవడు, కొడుకు, కోడలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జర్మనీలో విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు. నవ్యతేజ - శరణ్య దంపతుల కుమారుడైన ఒట్టూరు.లిషాన్‌రామ్ మూడవ పుట్టినరోజు సందర్భంగా బుధవారం సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, విశ్రాంత లెక్చరర్ రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.వి.ఎస్. ప్రసాద రావు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందితో రివ్యూ

ప్రజాశక్తి-అనంతసాగరం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీ ఉపాధి హామీ పథకంనకు సంబంధించి సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎ.పి.ఒ.తో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీల శాతాన్ని పెంచాలని, ఫారం పాండ్స్, హార్టీకల్చర్ టార్గెట్లు పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ రివ్యూ మీటింగ్‌లో ఎ.పి.ఒ., ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కావలి : గ్రామ,వార్డ్ సచివాలయం ఉద్యోగుల సమస్యలపై ఎపి ఎన్‌జిఒ తాలూఖా అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి నాగరాజు కావలి ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

24గంటలపాటు మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల హెడ్ క్వార్టర్‌లో ఓ వైన్స్ దుకాణంలో 24 గంటలు మద్యం అమ్ముతున్న దృశ్యాలు మండలంలోని పలు గ్రూపులలో హల్ చల్ చేయడం జరిగింది. ఇదే విషయాన్ని సంబంధిత ఎక్సైజ్ సీఐ రమణమ్మకు ఫోన్ చేయగా ఎన్నిసార్లు కాల్ చేసినా.. లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. ఇకనైనా ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, నాయకులు గమనించి తగు చర్యలు తీసుకోవాలని, ఇదే విడ్డూరమని ప్రజలు ఆవేదన చెందారు.

డంపింగ్ యార్డ్‌గా ఆలయ పరిసరాలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడ గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానం, పరిసరాలు మురుగు కూపంగ ఉండడాన్ని చూసిన అధికారులు నివ్వెర బోయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. జొన్నవాడ గ్రామానికి చెందిన సింగిరిమధు అనే వ్యక్తి ఆలయ పరిసరాలలోని మురుగు నీటితో పెన్నా నది కలుషితం అవుతుందని జాతీయ హరిత ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేశారు. ఎన్‌జిటి ఆదేశాలతో రీజనల్ డైరెక్టర్ వరలక్ష్మి, ఆర్డీవో అనూష, ఏపీ పొల్యూషన్ బోర్డు అధికారి అశోక్ కుమార్, తదితరులు ఆలయ పరిసరాలను పరిశీలించి నదిలో కలుస్తున్న మురుగునీటి శాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం ఆర్‌డిఒ అనూష మాట్లాడుతూ పెన్నా నది జలాలు ఎంత మేర కాలుష్యం అయ్యాయో గుర్తించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.